క్లుప్తంగా

ఉత్సాహంగా బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

జూపూడి(ఇబ్రహీంపట్నం): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యువ భారత్ మై భారత్ నినాదంతో స్థానిక నిమ్రా కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ గురువారం నిర్వహించారు. కళాశాలలో బాయ్స్ క్యాటగిరీలో వాలీబాల్, షాట్ పుట్, రన్నింగ్, ఉమెన్స్ కేటగిరీలో కబాడీ, రన్నింగ్, షార్ట్‌పుట్ క్రీడలు నిర్వహించారు. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ అక్బర్‌ఖాన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ సత్తార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి 1989–90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు లక్ష రూపాయలను గురువారం అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు జగ్గవరపు రంగారెడ్డి, పాఠశాల హెచ్ఎం శోభారాణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి. పుల్లారావు సమక్షంలో నగదు మొత్తాన్ని అందజేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి నందమూరి తిరుమలరావు రూ.50 వేలు హైస్కూల్ అభివృద్ధికి అందజేశారు.

పాఠశాలలో మొక్కలు నాటిన ఉపాధ్యాయుడు

కాచవరం(ఇబ్రహీంపట్నం): ఉపాధ్యాయ వృత్తిలో చేరి 23 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కాచవరం ఎంపీపీ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా పాఠశాలలో గురువారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ తనతో పాటు 2002లో డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులందరూ వారు పనిచేస్తున్న పాఠశాలల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం భవానీ, సీఆర్పీ దొంతమాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్ షిప్ విజేతలకు సన్మానం



నూజివీడు: జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2025 పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని నూజివీడులోని లక్ష్మీ కల్చరల్ అకాడమీ డైరెక్టర్ ఆర్. లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2025 (బడేటి కప్) పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు అభినందన సభను గురువారం నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ సర్కిల్ సమీపంలోని లక్ష్మీ అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన టి. ఆకాంక్ష, బి. పునీత్, ఆద్య కార్తీక, మను సాత్విక్, షర్లిన్, నవ్య శ్రీ, టి. అమన్, కరాటే కోచ్ మణికంఠను విజేతల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

వసతిగృహం సందర్శన

జి.కొండూరు: స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఆర్.రామ్మోహన్‌రావు గురువారం సందర్శించారు. ఎస్సీ వసతిగృహానికి ప్రత్యేక అధికారిగా నియమించబడిన తర్వాత మొదటిసారి సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు భారతదేశం మ్యాప్‌లు, స్వీట్లను అందజేశారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వసతిగృహం వార్డెన్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 16 మంది ఎంపిక

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. బెంగళూరు టాప్ అకాడమీ నిర్వహించిన ఆన్‌లైన్ రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ ఆర్ రౌండ్ల అనంతరం ఇంటర్వ్యూలో 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్ర బాబు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: దీపావళి నేపథ్యంలో పట్టణంలోని వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలను వివరించారు. లైసెన్స్ లేకుండా ఎక్కడైనా బాణసంచా అమ్మకాలు నిర్వహిస్తున్నా, అనధికారికంగా బాణసంచా సామగ్రిని భారీ ఎత్తున నిల్వచేసినా సమాచారాన్ని తెలపాలన్నారు. ప్రజలు పండుగను సురక్షితంగా నిర్వహించుకునేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఐ కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

- తుప్పుపడుతూ మూలకు చేరిన వైనం
- అలంకారప్రాయంగా రైతు సేవా కేంద్రాలు
- రైతులకు అందని వ్యవసాయ శాఖ సేవలు
- గత ప్రభుత్వంలో అమూల్యమైన సేవలు



రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రాలు

నూజివీడు: రాష్ట్రంలోని రైతులకు మేలు చేకూర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకువచ్చింది. దీనిలో భాగంగా గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు ముంగిటకే అన్నిరకాల ప్రభుత్వ సేవలను అందజేసింది. ఈ నేపథ్యంలోనే రైతు భరోసా కేంద్రాల్లోనే కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఇందులో నమోదు చేయడం ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాలను ఆర్డర్ పెట్టేవారు. దీంతో ఎరువులు, విత్తనాలు గ్రామ స్థాయిలోనే రైతులకు అందేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఉపయోగించకుండా మూలన పడేసింది. దీంతో ఆ యంత్రాలు తుప్పు పడుతుండగా రైతులకు గ్రామస్థాయిలో వ్యవసాయ శాఖ సేవలు అందకుండా పోయాయి.

గత ప్రభుత్వంలో 84 కియోస్క్ యంత్రాల ఏర్పాటు..

నూజివీడు నియోజకవర్గంలోని 84 రైతు సేవా కేంద్రాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. దీని ద్వారా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందించే ప్రయోజనాలు ఆన్‌లైన్ చేసేవారు. అంతేగాకుండా విత్తనాలు, ఎరువులు, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తదితర వాటిని కొనుగోలు కోసం రైతులు ముందస్తుగా కియోస్క్ యంత్రంలో నమోదు చేసి వాటికి నగదు చెల్లించి ఆర్డర్ చేసేవారు. ప్రభుత్వం వెంటనే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసేవి. దీంతో గ్రామంలోనే రైతులకు కావాల్సినవి అందేవి. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పని తప్పేది. అంతేగాకుండా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు చేతికి అందేవి. రైతులు ఏ పంట వేయాలన్నా ఆ పంటకు సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపర్చి ఉండేవారు. అయితే ప్రస్తుతం ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వీటిని కూటమి ప్రభుత్వం మూలన పడేసింది.

కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యం..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి నిర్వీర్యం చేసింది. పేరుకే సేవా కేంద్రాలు తప్పితే రైతులకు సేవలను అందించడంలో ఘోరంగా విఫలమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అందినట్లుగా ఈ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సేవలు అందడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎరువులు, విత్తనాల సరఫరాను సైతం పూర్తిగా నిలిపివేయడంతో రైతు సేవా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. వచ్చే సీజన్ నుంచైనా వాటిని వాడుకలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

మూలకు చేరాయి



రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలను ఉపయోగించకపోవడంతో అవి మూలన పడ్డాయి. దీంతో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందకుండా పోయాయి. రైతుసేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి.

– పాలడుగు విజయ్‌కుమార్, రైతు, తుక్కులూరు

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు విక్రయించాలి



రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలను విక్రయించాలి. దీనివల్ల రైతులకు అధిక ధరల బాధ తప్పుతుంది. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– పాలేటి సుభాష్ చంద్రబోస్, సీపీఎం మండల కార్యదర్శి, నూజివీడు

ధాన్యం రవాణాకు ట్రాక్టర్లు ఏర్పాటు చేయాలి

విజయవాడ సబ్ కలెక్టర్ చైతన్య

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ఖరీఫ్ ధాన్యాన్ని మిల్లర్లకు రవాణా చేసేందుకు స్థానిక రైతులు ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య విజ్ఞప్తి చేశారు. కొత్తూరు తాడేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లున్న రైతులు సొంత ఖర్చులతో జీపీఎస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని ధాన్యం పొలాల నుంచి రైస్ మిల్లులకు రవాణా చేసుకోవాలన్నారు. రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందని,గోనె సంచులను ప్రభుత్వం సరఫరా చేస్తుందని, తేమ శాతం కొలిచే బాధ్యతలను రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించే దానిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సమావేశంలో సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, తహసీల్దార్ బి.సుగుణ, మండల వ్యవసాయాధికారి కె.రఘురాం, వీఆర్వో చక్రధరరావు, రైతులు, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

పాత హాస్టల్ భవనం కూల్చివేతకు టెండరు ఖరారు

మైలవరం: మైలవరం రాజాపేటలోని బాలికల వసతిగృహం భవనం కూల్చివేతకు బహిరంగ వేలం నిర్వహించగా రూ. లక్షకు టెంటర్ ఖరారైందని ఏఎస్ డబ్ల్యూఓ గాయత్రి గురువారం తెలిపారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. ప్రస్తుతం వసతిగృహంలో 70 మంది విద్యార్థినులు ఉండగా వీరిని తాత్కాలికంగా ప్రైవేట్ భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవనం ఖాళీ అయిన తరువాత కూల్చివేసి నూతన భవన నిర్మాణం చేపడతారని వివరించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు రామిరెడ్డి



చిట్టేలలో సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తంగిరాల రామిరెడ్డి

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నించడాన్ని ప్రజలకు తెలియజేసి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు తంగిరాల రామిరెడ్డి పేర్కొన్నారు. తిరువూరు మండలం చిట్టేలలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టి వివిధ దశల్లో ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి కంకణం కట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరువూరు మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నాయకులు సీతారామయ్య, సిరసాని ప్రకాష్, మామిడి కుటుంబరావు, సుధారాణి, మామిడి కోటేశ్వరి, బండారు పద్మావతి, మోదుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు.

నూజివీడులో జీఎస్టీపై అవగాహనా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రవాణా శాఖాధికారులు, సిబ్బంది

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను కుదించడంతో వాహనాల ధరలు గణనీయంగా తగ్గాయని నూజివీడు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలెందు శేఖర్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బస్టాండ్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వాహనాల కొనుగోలుదారులకు సైతం వెసులుబాటు కలిగిందన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల ధరలు పెద్దఎత్తున తగ్గాయని చెప్పారు. జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీవీ కృష్ణవేణి, కార్యాలయ సిబ్బంది, ఆటోవాలాలు, టాక్సీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ



విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేస్తున్న హెచ్ఎం విజయకుమారి

నూజివీడు: ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన మండలంలోని అన్నవరం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయిని మంగలక్ష్మి క్రీడా దుస్తులను గురువారం అందజేశారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబరచడం ద్వారా 12 మంది విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. వీరందరికి బహూకరించిన క్రీడా దుస్తులను హెచ్ఎం జి. విజయకుమారి చేతుల మీదుగా అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పి. రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



నూజివీడు: నూజివీడులో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో అథ్లెటిక్స్‌లో త్రివిధ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ గురువారం తెలిపారు. అండర్–14 100 మీటర్ల పరుగు పందెంలో డేనియల్ రాయ్, 200 మీటర్ల పరుగు పందెంలో పి. సంగీత్, 400 మీటర్ల పరుగు పందెంలో బి. కార్తీక్, అండర్–17 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్ రాహుల్, 200 మీటర్ల పరుగు పందెంలో ఎస్. ప్రవణ్, 800 మీటర్ల పరుగు పందెంలో వి. శ్యామ్, కె. రోనీకమల్, 1500 మీటర్ల పరుగు పందెంలో కె. ఉదయ్, జి. లక్ష్మణ్, 3 కి.మీ పరుగు పందెంలో ఎస్. ప్రణవ్, కె. రోనీ కమల్, 5 కి.మీ నడకలో కె. జస్వంత్, ఎస్కే సుభానీ, లాంగ్ జంప్‌లో సీహెచ్ రాహుల్, డిస్కస్‌త్రోలో పి. శ్యామ్‌బాబు ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనాల తనిఖీ

కంచికచర్ల: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోతారని ఎస్ఐ విశ్వనాథ్ అన్నారు. స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో గురువారం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో సంబంధిత ప్రతాలు అందుబాటులో ఉండాలని, రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే, వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని చెప్పారు. ఆటోడ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు ఉంచరాదన్నారు. అనంతరం హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై కూటమి డైవర్షన్ పాలిటిక్స్

వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



నకిలీ మద్యం అంశంపై జి.కొండూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

జి.కొండూరు: నకిలీ మద్యం కేసులో ప్రభుత్వానికి అంటుకున్న మకిలిని ప్రతిపక్ష పార్టీకి అంటించి రాష్ట్ర ప్రజల దృష్టి మరల్చేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న నీచమైన కుట్రలకు తెరపడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జడ రాంబాబు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రాజపు మాధవి అన్నారు. నకిలీ మద్యం కేసులో నిజాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. జి.కొండూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్‌పై అక్రమ కేసులు బనాయించేందుకు ప్రభుత్వం పూనుకుందని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

నిందితుడితో అసత్య ఆరోపణలు

ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం డంపు బయటపడిన తర్వాత ఆ ప్రదేశాన్ని పరిశీలించి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న కల్తీ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రజలకు తెలిసేలా ప్రయత్నించిన జోగి రమేష్‌పై కేసు డైవర్ట్ చేసేందుకు నిందితుడితో అసత్యాలు చెప్పించారన్నారు. అంతటితో ఆగకుండా ఫేక్ వాట్సాప్ చాట్‌లను సృష్టించి ఎల్లో మీడియాలో కథనాలను వండి వార్చారని చెప్పారు. ఆ వాట్సాప్ చాట్‌లను సోషల్ మీడియాలో ప్రచారం చేసింది కాక అవి ఫేక్ ప్రచారాలు అని ప్రజలకు తెలిపేందుకు కౌంటర్‌గా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వైఎస్సార్ సీపీ నాయకులను అణిచి వేసేందుకు పోలీసులు బెదిరింపులకు దిగడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనన్నారు. నిజంగా గత ప్రభుత్వం నుంచి ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేస్తే ఇప్పుడు, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ గాడిదలు కాస్తున్నారా అని ఎద్దేవా చేశారు. నాడు వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని మైలవరం వీరప్పన్ అని సంబోధించిన టీడీపీ నాయకులు నేడు ఆయన రాముడు మంచి బాలుడు అన్నట్లు మాట్లాడుతూ జోగి రమేష్‌పై స్థాయి మరిచి నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కనీసం ఎంపీటీసీగా పోటీచేసి గెలవలేని వ్యక్తులు కూడా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సీబీఐతో విచారణ జరిపించాలి

జోగి రమేష్ తనపై వస్తున్న ఆరోపణలకు స్పందించి లై డిటెక్టర్ పరీక్షకైనా, ప్రమాణం చేసేందుకైనా రావాలని సవాల్ విసిరితే ఇప్పటివరకు స్పందన లేదన్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సిట్ లాంటి సొంత సంస్థలను పక్కనబెట్టి సీబీఐతో విచారణ జరిపించి నిజాలను నిగ్గు తేల్చాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలకు చంద్రబాబు తూట్లు

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: ఫెడరల్ హక్కులను హరిస్తున్న ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు భజన చేయడం ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పొడవడమేనని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్రం ప్రభుత్వంపై ఆనాడు ఎన్టీఆర్ గర్జిస్తే, చంద్రబాబు నేడు కేంద్ర ప్రభుత్వానికి జీ హుజూర్ అంటూ మతోన్మాద ఫాసిస్టు శక్తులకు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి ప్యాకేజీలు ఇవ్వకుండా మోసం చేస్తున్న మోదీని కర్నూలుకు తెచ్చి అక్కడ ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు కోల్పోయారని హరినాథ్ అన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆగిరిపల్లి: బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ అన్నారు. బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో స్థలాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఎస్ఐ తవేరియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్'పై సమావేశం

నూజివీడు: 'ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్'పై సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక సబ్–కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న గురువారం తెలిపారు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, యువతకు 'ఫ్రమ్ నూజివీడు ఉయ్ లీడ్'కార్యక్రమం ఎంతగానో ఉపయోగమన్నారు.

సామూహిక సీమంతాలు



మైలవరం: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని సీడీపీఓ పుష్పలత అన్నారు. వెల్వడం గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణా మాసోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ జంక్ ఫుడ్ తినడం వలన వచ్చే అనర్థాలను వివరించారు. సూపర్‌వైజర్ జోజి కటాక్షం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను తెలిపారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం అసోసియేట్ సీహెచ్ దివ్యశ్రీ మాట్లాడుతూ స్థూలకాయం వలన వచ్చే ఆరోగ్య సమస్యలు, సమతుల ఆహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం బాలింతలకు శ్రీమంతాలు నిర్వహించి నూతన వస్త్రాలు అంజేశారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రంగారావు

మైలవరం: అందరికీ ఆహారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆకలి చావులు సంభవించకుండా అందరికీ ఆహారం కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వ్యక్తిగతంగా అందరూ ఆహారాన్ని వృథా చేయకుండా ఆకలితో ఉన్న వారికి అందించడంలో ముందుండాలని సూచించారు. వివాహాలు, పండుగలు, విందులు, వినోదాల సమయంలో ఆహారం వృథా అవుతోందని, దానిని నివారించడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి



చాట్రాయి: వన సంరక్షణ సమితిలో దుర్వినియోగమైన నిధుల విషయమై నిగ్గు తేల్చాలని సీఐటీయూ నూజివీడు నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేశారు. మండలంలోని పర్వతాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్వతాపురం వనసంరక్షణ సమితికి నిధులు ఎంత వస్తున్నాయో సభ్యులు ఎవ్వరికీ తెలియదన్నారు. ఇటీవల సుమారు రూ.40 లక్షల నిధులు మంజూరైతే సభ్యులకు తెలియకుండా దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. ఫారెస్టు అధికారులు నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి వన సంరక్షణ సమితి సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్ మిద్దె శివాజీ, నియోజకవర్గ సభ్యుడు శ్రీనివాసరావు, కొమ్ము ఆనందం తదితరులు పాల్గొన్నారు.